# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-25- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 90 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




బయోటెక్నాలజీ,మెడికల్ టెక్నాలజీ రంగాల్లో

## ఆవిష్కరణలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లో 'ఆసియా పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్ 2025'లో సిఎం రేవంత్
- "ఇన్నోవేషన్ ఆఫ్ భారత్ – ది బయోడిజైన్ బ్లూప్రింట్" ఆవిష్కరణ

హైదరాబాద్,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో ఏఐజీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఆసియా పసిఫిక్ బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్ 2025 లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

మిగతా 2లో



## సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ భేటీ..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నిర్మాతలు,కార్మికులు,ప్రభుత్వం కలిసే సమగ్ర విధానం అవసరం
- పరిశ్రమలో సంస్కరణలు తప్పనిసరని సీఎం స్పష్టం

2లో

## గర్భవతని చూడకుండా.. రంపంతో ముక్కలుగా నరికి ... హతమార్చిన భర్త

-మేడిపల్లిలో అమానవీయ ఘటన
-ముక్కలు చేసి మూసీ నదిలో పడేసిన శరీరం
-స్థానికులను కలవరపరిచిన దారుణం

"నువ్వే నా ప్రాణం.. సర్వస్వమని మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్న అతడు.. కొన్నేళ్లకే అసలు రూపం బయటపెట్టుకున్నాడు. గర్భిణీ అని కూడా చూడకుండా భార్యను అతి కిరాతకంగా రంపంతో ముక్కలు ముక్కలుగా నరికి చంపాడు. మేడ్చల్ జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన అందరి హృదయాలనూ కలచి వేస్తోంది."

2లో







## అధికారంలో ఉన్నా లేకున్నా సుధాకర్ రెడ్డి ఎప్పుడూ సిద్ధాంతాన్ని వదల్లేదు

- ఆయన వంటి నాయకులు దేశ రాజకీయాల్లో అరుదు
- కాంగ్రెస్ సమావేశంలోనూ ఆయన సేవలను గుర్తుచేసి ఘనంగా నివాళులర్పించాం
- కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం తీరని లోటు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు): సీపీఐ జాతీయ నాయకుడు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం నిరుపేదలకు, బహుజన వర్గాలకు, సిద్ధాంతపరమైన రాజకీయాలను విశ్వసించే ప్రతి ఒక్కరికీ తీరని లోటు అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ముఖ్యమంత్రి,

మిగతా 2లో



## దొంగ ఓట్లతోనే తెలంగాణలో బిజెపి ఎంపీలు గెలిచారు

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- సంచలన వ్యాఖ్యలు చేసిన టిపీసీసీ చీఫ్
- బండి సంజయ్ బీసీ కాదని దేశ్‌ముఖ్ అని సంచలన వ్యాఖ్య
- దేవుళ్ల పేరుతో ఓట్లు అడిగే బీజేపీ నేతలపై విమర్శలు
- కులం,మతం లేకపోతే బీజేపీ గెలవలేదని మండిపాటు

కరీంనగర్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతోనే గెలిచారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కరీంనగర్ పర్యటనలో ఆయన మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మడత పెట్టి కొట్టే రోజులు

## త్వరలోనే వస్తాయి



- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- కాంగ్రెస్‌కి భయమే లేకపోతే ఉపఎన్నికలకు సిద్ధం కావాలన్న సవాల్
- 20 నెలల పాలనలో కేసులు మినహా ప్రజలకు ఉపయోగం ఏమీ చేయలేదని విమర్శ
- హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో అరాచకానికి పాల్పడుతోందని ఆరోపణ
- హైదరాబాద్‌ను కేసీఆర్ అభివృద్ధి చేశారని,బీఆర్ఎస్ కంచుకోటగానే నిలుస్తుందని వ్యాఖ్య

2లో

## మట్టి విగ్రహాలనే పూజిద్దాం

హైదరాబాద్, ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు): గణేష్ చతుర్థి వేడుకల సందర్భంగా భక్తులు మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని పర్యావరణ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ కోరారు. పర్యావరణ అనుకూలమైన గణేష్ విగ్రహాలను పూజించాలంటూ రూపొందించిన అవగాహన ప్రచార పోస్టర్లను శనివారం సచివాలయంలోని ఆమె ఛాంబర్‌లో

మిగతా 2లో







## గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్



కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం

దుర్గామాత మండపాలకు కూడా

హైదరాబాద్,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు): వినాయక చవితి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు, దసరా సందర్భంగా దుర్గా మాత మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ప్రకటించింది. మండపాలను తాత్కాలికంగా మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని పోలీసు శాఖ నిర్వాహకులకు సూచించింది.

మిగతా 2లో

## ప్లైవుడ్ గోడౌన్‌లో భీకర అగ్ని ప్రమాదం



- కాటేదాన్‌లో అగ్నికీలలు
- లక్షల విలువైన సామాగ్రి బూడిద
- అదృష్టవశాత్తు తప్పిన ప్రాణనష్టం
- కారణాలపై పోలీసులు దర్యాప్తు

హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు) మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లైవుడ్ గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అక్కడ గల సామాగ్రి క్షణాల్లోనే అగ్నికి ఆహుతైంది. ఘటనా స్థలమంతా పొగమంచుతో

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ భేటీ..

**హైదరాబాద్,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**



తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో నిర్మాతలు, దర్శకులు ముఖ్యమంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినిమా కార్మికుల పట్ల నిర్మాతలు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. కార్మికులు, నిర్మాతలు, ప్రభుత్వం కలిసి ఒక సమగ్ర విధానం రూపొందిస్తే పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. పరిశ్రమలో సుహృద్భావ వాతావరణం నెలకొనడం అవసరమని, దీనికోసం అవసరమైతే సినిమా కార్మికులను కూడా పిలిచి మాట్లాడుతానని తెలిపారు. సినిమా రంగంలోకి కొత్తగా వచ్చే వారికి నైపుణ్యాలు పెంపొందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇందుకోసం ఒక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని సూచించారు. అలాగే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా సినిమా రంగానికి సంబంధించిన శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసి, వివిధ విభాగాల్లో యువతకు అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.

తెలుగు సినిమా ఇప్పటికే అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి సందర్భంలో పరిశ్రమలో వివాదాలు, కలహాలు అవసరం లేదని, అందుకే సినీ కార్మికుల సమ్మె విరమణకు తాను చొరవ చూపినట్లు తెలిపారు. నిర్మాతలు-కార్మికుల మధ్య సంస్కరణలు తప్పనిసరి అని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఒక నియమావళి రూపొందించుకోవాలని సూచించారు. సినీ రంగంపై ప్రభుత్వం ఎటువంటి పక్షపాతం చూపబోదని, ఎవరు వ్యవస్థలను తమ ఇష్టం వచ్చినట్లు నియంత్రించాలనుకుంటే అది సహించబోమని హెచ్చరించారు. అందరూ చట్ట పరిధిలోనే పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో అంతర్జాతీయ సినిమాల చిత్రీకరణలు జరుగుతున్నాయని, తెలుగు సినిమాల చిత్రీకరణ ఎక్కువగా రాష్ట్రంలోనే జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా పరిశ్రమను నిలబెట్టడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు.

ఈ సమావేశంలో సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో పాటు నిర్మాతలు అల్లు అరవింద్, డి. సురేష్ బాబు, జెమిని కిరణ్, స్రవంతి రవికిశోర్, నవీన్ ఎర్నేని, వంశీ, బాపినీడు, డివివి దానయ్య, చెరుకూరి సుధాకర్, సాహు, అభిషేక్ అగర్వాల్, విశ్వప్రసాద్, అనిల్ సుంకర, శరత్ మరార్, ఎన్వీ ప్రసాద్, ఎస్కేన్, రాధామోహన్, దాము, దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, బోయపాటి శ్రీనివాస్, సందీప్ రెడ్డి వంగా, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, వెంకీ కుడుముల తదితరులు పాల్గొన్నారు.

# బయోటెక్నాలజీ,మెడికల్ టెక్నాలజీ రంగాల్లో ఆవిష్కరణలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం

(మొదటి పేజీ తరువాయి)



ఈ వేదికగా "ఇన్నోవేషన్ ఆఫ్ భారత్ - ది బయోడిజైన్ బ్లూప్రింట్" ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి బయోటెక్నాలజీ, ఫార్మా, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు అవసరమైన మద్దతు ఇవ్వడంలో తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని స్పష్టం చేశారు. బయోడిజైన్ విధానం ఉపయోగించి వైద్య ఉత్పత్తుల ఆవిష్కరణలకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. మాన్యుఫాక్చరింగ్ స్థాయి నుంచి నూతన ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందడం శుభ సూచకమని పేర్కొన్నారు.

భారతదేశ ఆరోగ్య రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి స్వదేశీ ఆవిష్కరణలు కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. అలాంటి పరిశోధనలకు తెలంగాణ ప్రభుత్వం సహకరించడమే కాకుండా వైద్య డేటాను డేటా గోప్యతా ప్రమాణాలకు లోబడి అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, కార్పొరేట్ భాగస్వాములతో అనుసంధానం చేసి ఆవిష్కరణలకు మరింత బలాన్ని ఇస్తామని చెప్పారు.

"ఇప్పటివరకు మన ప్రతిభ ఇతర దేశాల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడింది. ఇకపై మన మేదస్సు దేశ ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన సమయం వచ్చింది" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. క్లినికల్ అవసరాలకు అనుగుణంగా ఆచరణాత్మక పరిష్కారాలను బయోడిజైన్ విధానం అందిస్తుందని, ఈ దిశగా ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న పరిశోధనలు అభినందనీయం అని అన్నారు.

లైఫ్ సైన్సెస్ రంగంలో జాతీయ స్థాయిలో తెలంగాణ ఉన్నత స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీ, ఇంప్లాంట్ టెక్నాలజీ, సర్జికల్ పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్ రంగాల్లో తెలంగాణకు గణనీయమైన పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగాలని "తెలంగాణ రైజింగ్" లక్ష్యంతో ముందుకు సాగుతోందని వెల్లడించారు.

వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనలో తెలంగాణ ముందంజలో ఉందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సుల్తాన్‌పూర్‌లో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్క్‌ను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేశామని, ప్రస్తుతం అక్కడ 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ విజయానికి స్థానిక స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలు, పరిశ్రమల సహకారం ప్రధాన కారణమని పేర్కొన్నారు.ఈ సమ్మిట్‌లో ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర రెడ్డి, బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్ చైర్మన్ డాక్టర్ రాజేశ్ కలపల, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు, సెంటర్ ఫర్ బయోడిజైన్ (స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ) డైరెక్టర్ డాక్టర్ అనురాగ్ మైరల్‌తో పాటు అనేక దేశాలకు చెందిన వైద్య నిపుణులు, పరిశోధకులు పాల్గొన్నారు.

# అధికారంలో ఉన్నా లేకున్నా సుధాకర్ రెడ్డి ఎప్పుడూ సిద్ధాంతాన్ని వదల్లేదు

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీపీఐ నాయకులు డి.రాజా, కె.నారాయణ, కూనంనేని సాంబశివరావు, అజీజ్ పాషా తదితరులతో మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి చేసిన సేవలను స్మరించుకున్నారు. విద్యార్థి ఉద్యమాల నుండి జాతీయ రాజకీయాల వరకు ఆయన నిరాడంబరంగా, రాజీపడని సిద్ధాంతాలతో కృషి చేశారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

ఏఐఎస్ఎఫ్ నాయకత్వం నుండి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడిగా ఎదిగినా ఆయన ఎప్పుడూ అహంకారానికి దూరంగా ఉన్నారని రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు జిల్లాకు చెందిన సురవరం, బూర్గుల రామకృష్ణరావు, జైపాల్ రెడ్డి వంటి మహనీయుల కోవలో నిలిచారని, జిల్లా ప్రతిష్టను పెంచారని తెలిపారు. హైదరాబాదు విముక్తి ఉద్యమంలో, పత్రికా సంపాదకుడిగా ఆయన కుటుంబం చేసిన సేవలను గుర్తుచేస్తూ, తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప రెడ్డి పేరును పెట్టడం తమ ప్రభుత్వానికి గౌరవకారణమైందన్నారు.

"అధికారంలో ఉన్నా లేకున్నా సుధాకర్ రెడ్డి ఎప్పుడూ సిద్ధాంతాన్ని వదల్లేదు. ఆయన వంటి నాయకులు దేశ రాజకీయాల్లో అరుదు. కాంగ్రెస్ సమావేశంలోనూ ఆయన సేవలను గుర్తుచేసి ఘనంగా నివాళులర్పించాం. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే సంతాప సందేశం పంపించారు. సుధాకర్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి, చాకలి ఐలమ్మ పేరును మహిళా విశ్వవిద్యాలయానికి, జైపాల్ రెడ్డి పేరును పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి, గద్దర్ పేరును ప్రజా యుద్ధనౌకకు పెట్టిన విధంగానే, సుధాకర్ రెడ్డి జ్ఞాపకాన్ని శాశ్వతంగా నిలబెట్టేలా మంత్రివర్గంలో చర్చించి సముచిత నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మడత పెట్టి కొట్టే రోజులు

# త్వరలోనే వస్తాయి



**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉపఎన్నికల భయంతోనే కాంగ్రెస్‌లోకి ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలు వణికిపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రజలకు నిజంగా సేవలందించే ధైర్యం ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఫిరాయింపుల బదులు ఉపఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డినా?.. కేసీఆరా? అనే ప్రశ్నకు ప్రజలే సమాధానం చెబుతారని స్పష్టం చేశారు.

ఆదివారం మియాపూర్‌లో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన.. 20 నెలల పాలనలో రేవంత్ ప్రభుత్వం చేసిందల్లా కేసీఆర్, కేటీఆర్‌లపై కేసులు పెట్టడమే తప్పా ప్రజలకు ఉపయోగకరమైన పని ఏదీ చేయలేదని ఎద్దేవా చేశారు. స్వార్థ ప్రయోజనాలకే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు.

హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలు చేస్తోందని మండిపడ్డ కేటీఆర్.. "దుర్గం చెరువు వద్ద సీఎం రేవంత్ సోదరుడి ఇల్లు కూల్చే ధైర్యం ఉందా?" అంటూ సవాల్ విసిరారు. బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ స్వయంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.హైదరాబాద్ బీఆర్ఎస్ కంచు కోటగానే నిలుస్తుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో నగరం అభివృద్ధి శిఖరాలకు చేరిందని, తెలంగాణకు గుండెకాయగా మారిందని గుర్తు చేశారు. రైతు బంధు, ఆసరా పథకాలు కేసీఆర్ కృషి ఫలమని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సన్నాసి పనులతో ప్రజలను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు.



# మట్టి విగ్రహాలనే పూజిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల నుంచి ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలకు మారాలన్నారు. మట్టి గణేష్ విగ్రహాలను తయారుచేసి ఇంట్లో, నివాస ప్రాంతాల్లో పూజిద్దామన్నారు. పూజల్లో ఉపయోగించే పూలు, మూలికలను కంపోస్ట్ చేయాలని, బయోడిగ్రేడబుల్ కాని పదార్థాలను నీటి వనరుల్లో వేయకూడదని చెప్పారు. 2025 గణేష్ చతుర్థికి సంబంధించి టీజీ పీసీబీ మట్టి గణేష్ విగ్రహాల ప్రచారం నిమిత్తం పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. అలాగే జీహెచ్ఎంసీతో పాటు వివిధ జిల్లాల్లో పీసీబీ ఆధ్వర్యంలో 3.24 లక్షలకు పైగా మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాలు చేపడుతునట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో టీజీపీసీబీ సభ్య కార్యదర్శి జి.రవి, చీఫ్ ఇంజనీర్ రఘు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

(మొదటి పేజీ తరువాయి)



విద్యుత్ లోపాలు, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మండపాల వద్ద ఇసుక సంచులు, నీటి డ్రములు సిద్ధంగా ఉంచాలని, పీవోపీ విగ్రహాల స్థానంలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని పర్యావరణ పరిరక్షణ కోసం పిలుపునిచ్చింది.

నిమజ్జన రద్దీని తగ్గించేందుకు మూడు, ఐదు, ఏడు రోజులకే విగ్రహ నిమజ్జనాన్ని ప్లాన్ చేసుకోవాలని సూచించింది. నిమజ్జనానికి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఉన్న వాహనాలను మాత్రమే ఉపయోగించాలని తెలిపింది. ముందస్తు అనుమతులతోనే సౌండ్ సిస్టమ్ వాడుకోవాలని, డీజేలకు అనుమతి లేదని పోలీసులు హెచ్చరించారు.

మతపరమైన ప్రదేశాల వద్ద జెండాలు, పోస్టర్లు, బ్యానర్లు ఉంచరాదని, రద్దీగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ల వినియోగాన్ని నిషేధించారు. విరాళాలు పూర్తిగా స్వచ్ఛందంగా మాత్రమే స్వీకరించాలని, మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 10వ రోజు నిమజ్జనంతో పాటు మిలాద్‌ఉన్‌నబీ ఉత్సవాలు ఉండటంతో, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ప్లైవుడ్ గోడౌన్‌లో భీకర అగ్ని ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)



కమ్ముకుపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.అగ్నిప్రమాదం జరిగిందన్న సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమించారు. గంటల పాటు మంటలు భగ్గుమన్నా చివరికి అదుపులోకి తెచ్చారు.ఈ ప్రమాదంలో లక్షల రూపాయల విలువైన సామాగ్రి దగ్ధమై బూడిదైపోయిందని అధికారులు తెలిపారు. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

మంటల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ఘటన జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## గర్భవతని చూడకుండా..

# రంపంతో ముక్కలుగా నరికి ... హతమార్చిన భర్త

**మేడ్చల్,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ జిల్లాలో చోటుచేసుకున్న ఘోర ఘటన అందరినీ కలవరపెడుతోంది. మేడిపల్లి బాలాజీహిల్స్ కాలనీలో ఓ భర్త తన గర్భిణీ భార్యను అమానుషంగా రంపంతో ముక్కలు చేసి హతమార్చాడు. ఐదు నెలల గర్భవతిగా ఉన్న స్వాతి (25)ని భర్త మహేందర్ రెడ్డి క్రూరంగా హతమార్చి, శరీర భాగాలను మూసీ నదిలో పడేశాడు. మొండాన్ని మాత్రం ఇంట్లో ఉంచడంతో దుర్వాసన రావడంతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది.

వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన స్వాతి-మహేందర్ రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇటీవలే హైదరాబాద్ బోడుప్పల్‌కు వలస వచ్చిన వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం మహేందర్ తన భార్యను హతమార్చి, శరీర భాగాలను విభజించి కవర్లలో వేసి వేర్వేరు ప్రదేశాల్లో పడేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేశారు.



స్వాతి తల్లి కన్నీటి పర్యంతమై మాట్లాడుతూ, "డిగ్రీ చదువుతున్నప్పుడు మాయ మాటలతో మా కూతుర్ని తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి తర్వాత పూర్తిగా మారిపోయి మా కూతుర్ని చిత్రహింసలు పెట్టేవాడు" అని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులు ఈ హత్య పూర్తిగా ప్రణాళికాబద్ధంగానే జరిగిందని అనుమానిస్తున్నారు. మిగిలిన శరీర భాగాల కోసం మూసీ నదిలో గాలింపు కొనసాగుతోంది. ఈ ఘటనతో ప్రేమ వివాహాలు, గృహహింస, మహిళల భద్రతపై మళ్లీ చర్చ చెలరేగింది.

# సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి, డా. చిన్నారెడ్డి



**వనపర్తి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ మఖ్దూమ్ భవన్‌లోని సిపిఐ కార్యాలయంలో సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో కలిసి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి ఘనంగా నివాళుల ర్పించారు.

ఈ సందర్భంగా డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ -
"సురవరం సుధాకర్ రెడ్డి మృతి దేశ కమ్యూనిస్ట్ ఉద్యమానికి, బడుగు-బలహీన వర్గాలకు తీరని లోటు" అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు, కమ్యూనిస్ట్ కార్యక ర్తలకు సీఎం రేవంత్ రెడ్డి, డా. చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## సురవరం సుధాకర్ రెడ్డికి ఘన నివాళి



◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వన పర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక ఖాయం వద్ద నివాళులు అర్పించా రు. పుష్పాంజలి ఘటించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. నిబద్ధతతో పనిచేసే నాయకులు కొద్ది మందే ఉంటారు. అలాంటి నిబద్ధత గల నాయకుల్లో సురవరం సుధాకర్ రెడ్డి ఒకరు. ఆయన సేవలు చిరస్మరణీయాలు అని పేర్కొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలపై అవగాహన సదస్సు



**ధర్మసాగర్,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ధర్మ సాగర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మసా గర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు.ఉత్స వాల నిర్వహణలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ప్రజల సౌకర్యం, పర్యావరణ పరిర క్షణ అంశాలపై ఆయన సూచనలు చేశారు. మండపాల వద్ద విద్యుత్ సదుపాయాలను జాగ్రత్తగా వినియోగించాలని, అగ్ని ప్రమా దాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసు కోవాలని తెలిపారు. పీవోపీ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాల ని, మండపాల వద్ద నీటి డ్రములు, ఇసుక సంచులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అంతేకాకుండా, నిమజ్జన సమయంలో రద్దీని నియంత్రించేందుకు ముందస్తు ప్రణా ళిక అవసరమని, సౌండ్ సిస్టమ్ వినియోగం కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవా లని కమిటీ సభ్యులను ఆదేశించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకుంటూ, శాంతిభద్రతలను కాపాడాలని ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ కోరారు.





# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ కడియం కావ్య

**ఆత్మకూరు,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**

ఆత్మకూరు మండలం పెద్దపురం గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధుల నుండి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మహిళా కమ్యూనిటీ హాల్ కు వరంగల్ పా ర్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య, శాసన సభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన డా. కడియం కావ్య దేశ అభి వృద్ధి మహిళా సాధికారతపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. మహిళలు ఆర్థి కంగా ఎదిగితేనే కుటుంబం, సమాజం, రాష్ట్రం, దేశం ప్రగతి సాధిస్తుందని పేర్కొ న్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వ రులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. మొదటి సంవత్సరంలో నే 21,600 కోట్ల రూపాయల వడ్డీరహిత


- దేశ ప్రగతి మహిళా అభ్యున్నతిపై ఆధారపడి ఉంటుంది
- కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- సన్నబియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకం



రుణాలు మహిళా సంఘాలకు అందజే శామని తెలిపారు. పెద్దపురం గ్రామానికి మహిళా కమ్యూనిటీ హాల్ అందుబాటులో కి రావడం ద్వారా మహిళల అభివృద్ధి కార్య క్రమాలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మహిళలు డైరీ ఫార్ములు, చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందజేస్తోందని చెప్పారు.
రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తరువాతే పేదలకు ఇండ్లు లభించాయని గుర్తుచేశారు. పేదవారు అన్నం కోసం ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించా రని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన భారీ అప్పులకు నెలకు 6,500 కోట్ల రూపాయల వడ్డీ కడుతూనే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ-అభివృద్ధి కార్యక్ర మాలను ఆపకుండా కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేం దుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రజిత, కవిత, జ్యోతి, ప్రత్యేకాధికారి నిర్మల, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, MPO విమల, సీసీలు రజిని, భాగ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ సునంద సుధాకర్ రెడ్డి, మండల పార్టీ, గ్రామ పార్టీ అధ్యక్షులు, సమ న్వయ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అల్వాల్ గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఆంజనేయ దేవాలయ భజన బృందం

## విజయవంతంగా పూర్తయిన శ్రావణ మాస భజనోత్సవాలు



**వనపర్తి, ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమం దడి మండలం అల్వాల్ గ్రామంలో శ్రావణ మాసం సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భజనోత్సవా లు వైభవంగా జరిగాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గ్రామ భక్తులు సమూహంగా భజనలు చేసి ఆధ్యాత్మిక వాతావ రణాన్ని అలరించారు. ముఖ్యంగా ప్రతి శనివారం నిర్వహించిన రథోత్సవం విశేష ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు, హారతులు జరిపి, తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.
గ్రామ పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు ఎటువంటి కులమత, రాజకీయ వాదాలు లేకుండా ఐక్యంగా పాల్గొన డం విశేషం. భక్తి శ్రద్ధలతో సాగిన ఈ ఉత్సవం గ్రామ సమైక్యతకు నిదర్శనంగా నిలిచింది. కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన గ్రామ ప్రజలందరికీ శ్రీ ఆంజనేయ దేవాలయ భజన బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. గ్రామ చరిత్రలో నిలిచేలా ఈ శ్రావణోత్సవం ప్రత్యేక స్థానం సంపాదించిందని నిర్వాహకులు పేర్కొన్నారు.




# దేవరకద్ర ఎమ్మెల్యే తండ్రి కృష్ణారెడ్డికి ఘన నివాళులు

అడ్డాకుల మండల కాంగ్రెస్ నాయకులు

**దేవరకద్ర,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డాకుల మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని కృష్ణా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగుల విజయమోహన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి భీమన్న యాదవ్, సీనియర్ నాయకులు వేగనాథ్, దిలీప్, రాములు, బుచ్చన్న, చెన్నకేశవ, తిరుపతి యాదవ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



# ముదిరాజ్ భవన్‌కు మహార్దశ

పూర్తి స్థాయి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్‌లోని ముదిరాజ్ భవన్‌కు మంచి రోజులు రాబోతున్నాయి. ఆధునిక సౌకర్యాలతో భవనం పూర్తి స్థాయిలో రూపుదిద్దుకోనుంది.
గతంలో మున్సిపల్ నిధులతో ఈ భవనాన్ని కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి నిర్మించినప్పటికీ, కొన్ని పనులు ఇప్పటివరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధుల ఆహ్వానం మేరకు కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి, పర మేశ్వర్ రెడ్డి భవనాన్ని పరిశీలించారు. ముదిరాజ్ భవన్ పూర్తిస్థాయి నిర్మాణా నికి మరియు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని ఈ సం దర్భంగా రజితాపరమేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో డిఈ వెన్నెల గౌడ్, ఏఈ రాజ్ కుమార్, మహంకాళి కృష్ణ, మామిళ్ల బాలరాజు, ఈగ బాలయ్య, ఈగ లక్ష్మణ్, రాపాక వెంకటేష్, ఈగ అంజయ్య, ఈగ శ్రీనివాస్, మహంకాళి రాజు, సల్లా ప్రభాకర్ రెడ్డి, తలారి జహంగీర్, కావలి రాము తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్గిరి, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గంలో పేద మరియు మధ్యతరగతి ప్రజల వైద్య చికిత్స ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందజేయడం కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌కు చెందిన మల్లికార్జున్ కుటుంబానికి రూ. 2,00,000 విలువైన ఎల్ఓసి, గౌతమ్ నగర్ డివిజన్‌కు చెందిన ప్రియాంక కుటుంబానికి రూ. 2,50,000 విలువైన ఎల్ఓసి పత్రాలు మంజూరయ్యాయి. వీరిద్దరూ గత కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సీఎం సహాయనిధి కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసిందని ఎమ్మెల్యే తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడకుండా, వారి ప్రాణాలను రక్షించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం అమలు అవుతోంది. అవసరమైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని వినియోగించుకోవాలి. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితి త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షిస్తున్నాను అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం-25- ఆగస్టు 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# చర్లపల్లి జైలు నుండి ఖైదీ పరార్..!

## పెయింటింగ్ పనుల మధ్యలో జైలు ప్రహరీ దూకి తప్పించుకున్న నిందితుడు

**చర్లపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** చర్లపల్లి సెంట్రల్ జైలు నుండి ఖైదీ పరారైన ఘటన ఆదివారం సంచలనం రేపింది. జైలు హైటెక్ బ్యారక్‌లో ఉంచిన ఈ ఖైదీ పేరు ఖమర్ , బీహార్ రాష్ట్రానికి చెందిన అతను వయసు 19 ఏళ్ల వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఆయనపై హత్య (మర్డర్) మరియు పోక్సో కేసుల్లో నేరాలు నమోదయ్యాయి.

పెయింటింగ్ పనుల పేరుతో ప్రణాళిక సెంట్రల్ జైలులో గత కొన్ని రోజులుగా ప్రహరీ గోడలపై పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా ఖైదీలను కూడా సహాయకులుగా వినియోగిస్తున్నారు. ఆదివారం ఈ ఖైదీ పెయింటింగ్ చేస్తున్నట్లు నటిస్తూ భద్రతా సిబ్బంది దృష్టి మళ్లించి, ప్రహరీ గోడ దూకి పారిపోయాడు.

**జైలు సిబ్బందిలో కలకలం**

ఖైదీ పారిపోయిన విషయం వెలుగులోకి రాగానే జైలు అధికారులలో, భద్రతా సిబ్బందిలో కలకలం రేగింది. వెంటనే అలారం మోగించడంతో పాటు అన్ని గేట్లు మూసివేసి జైలు పరిసరాల్లో ముమ్మరంగా గాలింపు ప్రారంభమైంది.

**పోలీసుల గాలింపు ఆపరేషన్**

ఈ సంఘటనతో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు అలర్ట్ జారీ చేశారు. పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టగా, ఖైదీ ని పట్టుకున్నారన్న సమాచారం వచ్చినా ఇంకా అధికారిక నిర్ధారణ లేదు.

**భద్రతా లోపాలపై ప్రశ్నలు**

అత్యంత భద్రతతో కూడిన హైటెక్ బ్యారక్ నుంచి ఖైదీ పారిపోవడంతో జైలు భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తాయి. అధికారులు ఈ ఘటనపై విచారణకు ఆదేశాలు జారీ చేశారు.



# స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

**ఏ.ఎస్.రావు నగర్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా జీహెచ్ఎంసి పరిధి, ఏ.ఎస్.రావు నగర్ డివిజన్‌లోని పద్మశాలి టౌన్‌షిప్‌లో ఆదివారం రోజు రాత్రి ఒక స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించింది. స్క్రాప్ దుకాణంలో మంటలు అంటుకోవడంతో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. స్థానికులు తాము అందుబాటులో ఉన్న సౌకర్యాలతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించగా, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.



# గణేష్ ఉత్సవాల్లో డిజే సౌండ్లకు నో

## కీసర పోలీసుల అవగాహన సమావేశం

**కీసర, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు)**

రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, భద్రంగా సాగేందుకు రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు కీసర పోలీసులు డిజే ఆపరేటర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం కీసర పోలీస్ స్టేషన్‌లో సీఐ ఏ. అంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సుమారు 30 మంది డిజే ఆపరేటర్లు హాజరయ్యారు.

సమావేశంలో గణేష్ మండపాల్లో డిజే సౌండ్ సిస్టమ్స్ వినియోగం పూర్తిగా నిషేధించబడిందని స్పష్టంచేశారు. అధిక డెసిబెల్ శబ్దం ఆరోగ్యానికి హానికరం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి లౌడ్‌స్పీకర్లు, మ్యూజిక్ సిస్టమ్స్ వినియోగం నిషేధమని అధికారులు తెలిపారు.

సాంప్రదాయ పద్ధతుల్లో ఉత్సవాలు జరుపుకోవాలని, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంలో అందరూ సహకరించాలని పోలీసు అధికారులు డిజే నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల సమయంలో భద్రతా బందోబస్తు పటిష్టంగా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసుల సూచనలను డిజే ఆపరేటర్లు సమర్థిస్తూ భవిష్యత్తులో నియమావళిని పాటిస్తామని హామీ ఇచ్చారు.






# స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల జాతర

- పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- నియోజకవర్గానికి ఇప్పటివరకు 900 కోట్లు తెచ్చిన విషయాన్ని వెల్లడింపు
- అవినీతి లేని పాలనకే కట్టుబడి ఉన్నానని స్పష్టం

**ధర్మసాగర్,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపడుతున్న పనుల జాతర2025 లో భాగంగా పలు అభివృద్ధి పనులకు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో 46 లక్షల రూపాయలతో, ఎస్సిపి నిధుల ద్వారా 22 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి, అలాగే ధర్మసాగర్ గ్రామంలో 25 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల పనులకు శ్రీహరి ప్రారంభం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, 73 ఏళ్ల వయసులోనూ ప్రతిరోజూ నియోజకవర్గం అంతా తిరుగుతూ అభివృద్ధి పనులు చేపడుతున్నానని ఎమ్మెల్యే తెలిపారు. తన రాజకీయ జీవితం అంతా అవినీతి లేని విధంగా కొనసాగించానని, ఒక్క రూపాయి లావాదేవీ నిరూపించగలిగితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. గతంలో ప్రజలు తమ ఎమ్మెల్యే గురించి చెప్పడానికి సిగ్గుపడాల్సి వచ్చేదని, కానీ తన పనితీరుతో మాత్రం గర్వంగా చెప్పుకునే స్థితి తీసుకొచ్చానని పేర్కొన్నారు.

శ్రీహరి మాట్లాడుతూ — నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు 900 కోట్ల రూపాయల నిధులు తెచ్చానని, ఇది సామాన్య విషయం కాదని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గానికి ఇంత మొత్తంలో నిధులు రాలేదని, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ కక్షల వల్ల పెద్దపెండ్యాల గ్రామం నష్టపోయిందని, కానీ ఒక్క ఏడాది కాలంలోనే దాదాపు 6 కోట్ల రూపాయల నిధులు కేటాయించామని వివరించారు. త్వరలోనే పెద్దపెండ్యాల-చిన్నపెండ్యాల రహదారి నిర్మాణం, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ధర్మసాగర్ మోడల్ కాలనీలో 50 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం అని శ్రీహరి తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పెద్ద ఎత్తున జరుగుతోందని, లబ్ధిదారులకు ఒక్క రూపాయి అవినీతి లేకుండా బిల్లులు అందిస్తున్నామని స్పష్టం చేశారు. రేషన్ షాప్‌ల ద్వారా పేద కుటుంబాలకు ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు అదనపు పేర్ల చేర్పులు జరిగాయని, కొత్త కార్డుదారులకు సెప్టెంబర్ నుంచే సన్నబియ్యం అందజేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాక, 9 రోజుల్లోనే 65 లక్షల మంది రైతులకు 9 వేల కోట్లు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# ఖవతీన్ ఇజ్తేమా వక్ఫ్ అవగాహన కార్యక్రమం ఘనంగా

**నాగారం, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో సేవ్ వక్ఫ్ - సేవ్ రాజ్యాంగ ఉద్యమంలో భాగంగా ఖవతీన్ ఇజ్తేమా వక్ఫ్ అవగాహన కార్యక్రమం నాగారం స్టార్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు మరియు కళాశాల బాలికలకు ప్రత్యేకంగా ఈ సదస్సు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా బోర్డు అధ్యక్షుడు హజ్రత్ మౌలానా ఖలేద్ సైఫుల్లా రహ్మానీ సాహబ్ మాట్లాడుతూ, వక్ఫ్ ఆస్తులు ముస్లింల సామాజిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి మూల స్తంభమని, వాటిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. 2025 వక్ఫ్ సవరణ చట్టం ముస్లిం సమాజ హక్కులను బలహీనపరిచే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో కల్పించిన మత స్వేచ్ఛ, మైనారిటీ హక్కులు పరిరక్షించడంలో సమాజం ఐక్యంగా ఉండాలని సూచించారు.

జలీసా యాసీన్ సాహెబా (న్యాయవాది) అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో, మహిళలకు వక్ఫ్ చరిత్ర, చట్టపరమైన అంశాలు, మరియు సమాజ నిర్మాణంలో వక్ఫ్ పాత్రపై వివరణాత్మక అవగాహన కల్పించారు.

కార్యక్రమ నిర్వాహకుడు సయ్యద్ ఒమర్ షఫీక్ మాట్లాడుతూ, మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లాలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఆదం షఫీక్, నాగారం మున్సిపాలిటీ ప్రతినిధులు, అనీస్ భాయ్, హబీబ్ భాయ్, ఖాజా భాయ్, గౌస్ భాయ్, అక్బర్ భాయ్, అజీమ్ భాయ్, మహమూద్ భాయ్, యూసుఫ్ భాయ్, ఇస్లాం భాయ్, రైస్ భాయ్, అష్రఫ్ భాయ్, హనీఫ్ భాయ్, షఫీ భాయ్ తదితర ముస్లిం ప్రముఖులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు వక్ఫ్ చట్టం పై అవగాహనతో పాటు సమాజ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నారు.





# మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఘనంగా ప్రారంభం

**మేడ్చల్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు.ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలి వచ్చి వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మలిపెద్ది సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్, కూకట్పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు వజ్రేష్ యాదవ్, బండి రమేష్, కోలన్ హనుమంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి బూపతి రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని మరింత బలపరచడానికి ఈ కార్యాలయం కేంద్రంగా ఉపయోగపడుతుందని నేతలు అభిప్రాయపడ్డారు. పలు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక నాయకులు భారీగా హాజరై జెండా ఆవిష్కరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు తమ ప్రసంగాల్లో, రాష్ట్రంలో పార్టీ పునరుద్ధరణకు ఈ కార్యాలయం కీలకమని పేర్కొన్నారు.




# గణనాథుడి ఆగమన శోభాయాత్రలో ఎమ్మెల్యే నాగరాజు



**వర్ధన్నపేట,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**

వర్ధన్నపేట నియోజకవర్గంలోని భీమారం ప్రాంతంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గడ్డం శివరాం సోదరుల ఆధ్వర్యంలో, రేణుక ఎల్లమ్మ గజానన యూత్ కమిటీ నిర్వహించిన వినాయక శోభాయాత్రలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. కళాకారుల బృందం, పోతరాజుల ఆటలు, వివిధ వేషధారణలతో శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. స్థానికులతో కలసి ఎమ్మెల్యే కూడా డాన్స్ చేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో పాల్గొని సాంప్రదాయాలను కొనసాగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని ప్రజలను కోరారు. యువత ఆనందోత్సాహాలతో, శ్రద్ధాభక్తులతో వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నవరాత్రి వేడుకలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగాలని ఆకాంక్షిస్తూ, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# శ్రావణ గాయత్రీ మహా యజ్ఞంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

**చిల్కానగర్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ ఈస్ట్ కళ్యాణపురిలో ఉప్పల్ ఆర్య సమాజ్ తపస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆచార్య వేద సింధు నేతృత్వంలో నిర్వహించిన శ్రావణ గాయత్రీ మహా యజ్ఞంలో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్విజ్ మరియు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు . కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, శ్రావణ గాయత్రీ మహా యజ్ఞంలో పాల్గొన్న భక్తులందరికీ గాయత్రీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను. ఇలాంటి పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించిన తపస్య ఫౌండేషన్ ఆచార్య వేద సింధుకి అభినందనలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపస్య ఫౌండేషన్ అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, కార్యదర్శి బొల్లా విజయ్ కుమార్, కోశాధికారి పత్తిపాక లక్ష్మణ్, గంగాధర్ మహాజన్, మహేందర్ జైస్వాల్, పండిత్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు.




# మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ ప్రారంభించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్

**చిల్కానగర్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ డివిజన్‌లోని అపురూప హైట్స్‌లో ఓం శాంతి ఓం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమం రాజయోగిని దీదీ ప్రకాశమణి జీ 18వ ఆరోహణ దినోత్సవం సందర్భంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "రక్తదానం అన్నిటికంటే శ్రేష్టమైన దానం. రక్తదానం ద్వారా ఒకరి ప్రాణం మాత్రమే కాకుండా ఒక కుటుంబాన్ని కాపాడగలుగుతాం," అని తెలిపారు.

క్యాంప్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కూడా పాల్గొని స్వయంగా రక్తదానం చేశారు. ఓం శాంతి ఓం వారు లక్ష యూనిట్ల రక్త సేకరణ లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పాన్ని ప్రశంసిస్తూ తాము కూడా ఆ ప్రయత్నంలో భాగస్వాములమవుతామని తెలిపారు.

రక్తదానం చేసిన వారికి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అపురూప హైట్స్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, వారి కార్యవర్గం, ఓం శాంతి ఓం టీమ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ మంత్రి

**వనపర్తి,ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆదివారం హైదరాబాద్ హిమయత్‌నగర్‌లోని మఖ్దూమ్ భవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వెంట పలువురు నాయకులు కూడా పాల్గొన్నారు.



## డాక్టరేట్ పొందిన సతీష్ యాదవ్‌ను ఘనంగా సత్కరించిన సాహితీ కళావేదిక సభ్యులు

**వనపర్తి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**

అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ ప్రజాసేవలో గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా సాహితీ కళావేదిక సభ్యులు, ప్రజా సంఘాలు ఆయనను ఘనంగా సత్కరించాయి. ఆదివారం ఉదయం సాహితీ కళావేదిక సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు సతీష్ యాదవ్ నివాసానికి వెళ్లి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందించారు. కళాకారులు కవితలు చెబుతూ, పాటలు పాడుతూ సతీష్ యాదవ్ సేవలను కొనియాడారు.

సమాజాభివృద్ధి లక్ష్యం ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో అందరం కలిసికట్టుగా వనపర్తిని కాపాడుతూ, సమాజ అభివృద్ధికి కృషి చేద్దాం" అని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్ గౌడ్, కవి బై రోజు చంద్రశేఖర్, గౌరవ డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయుడు కంటి నిరంజనయ్య, వనపర్తి గద్దర్ రాజారామ్ ప్రకాష్, కవి సత్తార్, బహుజన వేదిక అధ్యక్షుడు గంధం నాగరాజు, జైభీమ్ సేన అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు డి. రాములు, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## చైతన్య భూమి ప్రాంగణంలో బీసీ రిజర్వేషన్ల సాధన వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**కీసర, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**


మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి రాజీవ్ గృహకల్ప కాలనీలోని చైతన్య భూమి ప్రాంగణంలో వారవారీ జ్ఞానమాల కార్యక్రమం సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 181వ పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కమిటీ మేడ్చల్, మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సానాది సాయిబాబ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల అర్పించారు. తరువాత మాజి కౌన్సిలర్ మంగళపూరి వెంకటేష్, మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాట రాజుతో కలిసి బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఐకాస రాష్ట్ర కమిటీ రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సాయిబాబకు పూలమాలతో, శాలువాతో ఘన సన్మానం చేశారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బీసీలకు 42% రిజర్వేషన్ల సాధన కోసం ఐకాస కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం పాదయాత్రలు, రథయాత్రలు, సభల ద్వారా చైతన్యం కల్పిస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలంతా ఏకతాటిపైకి వచ్చి రిజర్వేషన్ల సాధనకు బలంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజి కౌన్సిలర్ మంగళపూరి వెంకటేష్, మోత రాజేంద్రప్రసాద్, తాడేపల్లి అబ్బులు, తగిలే రాధాకృష్ణ, కోలాటి రాజు, చెన్నయ్య, వెంకటేశ్వర్ రావు, పాడుగుల చంద్రమౌళి, కె.వి.రావు, జయమయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల తరలింపులో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండండి

- **పెద్దమందడి మండల విద్యుత్ అధికారి సుధాకర్ సూచన**

**పెద్దమందడి, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**



వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ విగ్రహాల తరలింపు, మండపాల వద్ద విద్యుత్ భద్రత పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దమందడి మండల విద్యుత్ అధికారి సుధాకర్ సూచించారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా విగ్రహాల తరలింపు మమ్మురంగా జరుగనుందని, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. విగ్రహాల ర్యాలీల మార్గాల్లో విద్యుత్ లైన్లకు ఆటంకం లేకుండా ముందస్తు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. మండప నిర్వాహకులు, భక్తులు తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించాలని ఆయన సూచించారు. విగ్రహాల ఎత్తును బట్టి రూట్లు నిర్ణయించుకోవాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. విద్యుత్ లైన్లకు కనీసం 2-3 అడుగుల దూరం పాటించాలని, మెటల్ ఫ్రేమ్ డెకరేషన్లను వీలైనంతవరకు తగ్గించాలని సూచించారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్ కోసం స్థానికులు స్తంభాలు ఎక్కరాదని, కేవలం విద్యుత్ శాఖ సిబ్బందే కనెక్షన్లు ఇవ్వగలరని స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పచ్చి బఠానీలతో పుట్టెడు లాభాలు..!



పచ్చి బఠానీలు పోషకాలకు నిలయం. వీటిలో విటమిన్-సి, మెగ్నీషియం, పొటాషియం మరియు కాల్షియం వంటి పోషకాలు ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.బఠానీలలో కరిగే ఫైబర్ కూడా ఉంటుంది, ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను సాధారణీకరిస్తుంది.పచ్చి బఠానీలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఉండే ప్రోటీన్లు, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీర కండరాలకు కూడా పచ్చి బఠానీలు మంచివి. రక్తపోటును నియంత్రించడంతో పాటు మలబద్ధకం సమస్యలకు పచ్చి బఠానీలు చెక్ పెడతాయి.పచ్చి బఠానీలు డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి. దీని GI తక్కువగా ఉంటుంది. ఇది చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ బ్లడ్ షుగర్ అకస్మాత్తుగా పెరగనివ్వదు. శారీరక శ్రమ, ఆహారం కారణంగా రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. శరీరంలో ఇనుము లోపం వల్ల అలసట, బలహీనత మరియు అనేక సమస్యలు వస్తాయి. ఇది ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు సహాయపడుతుంది. బఠానీలలో విటమిన్ సి, ఇ, ఎ జింక్ లాంటివి లభిస్తాయి, ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. అంతేకాదు ఇది మంట సమస్యను తగ్గిస్తుంది. రెగ్యూలర్‌గా పచ్చిబఠానీలు తినటం వల్ల కణాలు దెబ్బతినకుండా రక్షిస్తాయి. పచ్చి బఠానీలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణ సంబంధిత సమస్యల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. ప్రతిరోజూ పచ్చి బఠానీలు తింటే, మీ ప్రేగులలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. కడుపు సమస్యలను నివారిస్తుంది. బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారు మీరు పచ్చి బఠానీలను మీ ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఇందులో ప్రోటీన్ ఉంటుంది. ఇందులో ఐరన్, ఫోలేట్, విటమిన్ ఎ, ఫాస్పరస్ కూడా ఉంటాయి, ఇది కండరాల బలాన్ని ప్రోత్సహిస్తుంది.



# బంగాళాదుంప రసాన్ని తాగితే ఇన్ని లాభాలా?

రోజూ బంగాళాదుంప రసం తాగడం వల్ల అల్సర్లు, జీర్ణ సమస్యల నుండి సులభంగా ఉపశమనం లభిస్తుంది. ఇప్పటికే జీర్ణ సంబంధిత వ్యాధులు, ఇతర కడుపు సమస్యలతో బాధపడుతున్నవారు ఖచ్చితంగా బంగాళాదుంప రసాన్ని ప్రయత్నించాలి.బంగాళాదుంపలలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, ఈ రసం తాగడం వల్ల వివిధ రకాల ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటును అదుపులో ఉంచుతుంది. మంచి రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. బంగాళాదుంప రసం కళ్ళు, చర్మం, దంతాలు, నాడీ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.బంగాళాదుంపతో తయారు చేసిన జ్యూస్ తాగడం వల్ల కిడ్నీ స్టోన్ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఆరోగ్యానికి మేలు చేసే రాగి, మాంగనీస్, పొటాషియం, బివిటమిన్‌లను కలిగి ఉంటాయి. బంగాళాదుంప రసంలో లభించే ఫైబర్ శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో చురుకైన పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజు ఉదయం బంగాళాదుంప రసం తాగడం వల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుందని కొందరు ఆరోగ్య నిపుణులు అంటున్నారు. బంగాళాదుంప రసంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అనేక ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. మైగ్రేన్ బాధితులు బంగాళదుంప రసం తాగడం వల్ల ప్రయోజనం పొందవచ్చు. బంగాళదుంప రసం తాగడం వల్ల చర్మ సమస్యలు కూడా నయమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడుతుంది. వృద్ధాప్య సంకేతాలను నివారిస్తుంది. చర్మాన్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. బెల్లీ బ్లోట్ నివారిస్తుంది.

# గసగసాలు వాడుతున్నారా?.. ఈ ప్రయోజనాలన్నీ పక్కా!



గసగసాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గసగసాల్లో క్యాల్షియం, మాంగనీస్, ఫాస్పరస్, జింక్, ఐరన్, మెగ్నీషియం, ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్, ప్రోటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. ఇవి శరీరాన్ని వ్యాధుల నుండి రక్షిస్తాయి. పంటి నొప్పితో బాధపడేవారికి గసగసాలు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయి. అధిక దాహంతో బాధపడేవారికి గసగసాలు ప్రయోజనకరంగా ఉంటాయి. రాత్రి పడుకునే ముందు గసగసాల పేస్ట్ తయారు చేసి పాలతో కలిపి తీసుకోవడం వల్ల నిద్రలేమి నుండి ఉపశమనం పొందవచ్చు. నిద్రకు సంబంధించిన సమస్యలన్నీ కంట్రోల్ అవుతాయి. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను కరిగించడంలో కూడా గసగసాలు చక్కగా పని చేస్తాయి. గుండెకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయి. గసగసాలు మూత్రపిండాల నుండి కాల్షియంను తగ్గించి, మూత్రపిండాల్లో రాళ్లను విచ్ఛిన్నం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. మూత్రపిండాల్లో రాళ్లు పదే పదే ఏర్పడకుండా నిరోధిస్తాయి. గసగసాలలో మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. గసగసాలను రోజూ తినడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. గసగసాలు తినడం వల్ల అందాన్ని కూడా పెంచుకోవచ్చు. ఇందులో ఉండే పోషకాలు చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉండేలా హెల్ప్ చేస్తాయి. తరచూ చర్మ, జుట్టు సమస్యలతో బాధపడేవారు గసగసాలను తినడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు. గసగసాల్లో ఖనిజాలు, క్యాల్షియం పుష్కలంగా లభిస్తాయి. వీటిని తినడం వల్ల ఎముకలు, కండరాలు బలంగా ఆరోగ్యంగా ఉంటాయి. ఎముకలకు సంబంధించిన సమస్యలు తలెత్తవు.

# పండ్ల తొక్కలు పడేస్తున్నారా?



తాజా పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే పండ్ల తొక్కలు గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లో ఫైబర్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది.వీటిల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి, ఆపిల్, ద్రాక్ష, ఎండుద్రాక్ష, కివి వంటి పండ్ల తొక్కలలో ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి క్యాన్సర్‌ను నివారించడంలో, వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మ, జుట్టు సంరక్షణలో ప్రభావవంతంగా ఉంటుంది. పండ్ల తొక్కల్లోని మూలికా లక్షణాలు శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. నారింజ, ఎండుద్రాక్ష తొక్కలను ఎండబెట్టి పొడి చేసి చర్మానికి వాడటం వల్ల మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. ద్రాక్ష, జామ తొక్కల్లో రెస్వెరాట్రాల్ ఉంటుంది. ఇది క్యాన్సర్‌ను నివారించడానికి, వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయడానికి సహాయపడుతుంది.కీరదోస, నారింజ తొక్కల్లో ఫైబర్, సిలికా ఉంటాయి. ఇవి ఎముకలు, చర్మానికి ప్రయోజనకరంగా ఉంటాయి. నారింజ తొక్కలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్లు, నూనెలు ఉంటాయి. ఇవి చర్మానికి, కాలేయానికి మేలు చేస్తాయి. నల్ల ఎండుద్రాక్ష శరీరంలో రక్తాన్ని ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. ఎండిన నల్ల ఎండుద్రాక్ష తొక్క పొడి జీర్ణక్రియకు సహాయపడుతుంది. కివి పండు తొక్కలో చాలా యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. కివిలో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరాన్ని విష పదార్థాల నుంచి దూరంగా ఉంచడానికి సహాయపడుతుంది. బత్తాయి, కమలాపండ్లు తినడం వల్ల శరీరానికి వచ్చే వివిధ వ్యాధులను నివారించవచ్చని వైద్యులు అంటున్నారు. వీటి తొక్కలో ఫైబర్, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణక్రియను పెంచుతాయి. గుండెను రక్షిస్తాయి.



# ఈ పండ్లను కలిపి తింటున్నారా..?

అరటిపండ్లు శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తాయి. ఇందులో ఉండే పొటాషియం, కాల్షియం శరీర కండరాలను బలోపేతం చేస్తాయి. ఇవి శక్తిని అందించడంతో పాటు, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. ఎముకలను బలోపేతం చేస్తాయి. అరటిపండును రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.బొప్పాయి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బొప్పాయి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. బొప్పాయి- అరటి వాటి స్వంత లక్షణాలను కలిగి ఉండి.. శరీరానికి వివిధ విధాలుగా మేలు చేస్తాయి.ఎందుకు కలిపి తినకూడదు? : అరటిపండు - బొప్పాయి వేర్వేరు స్వభావాలు కలిగిన పండ్లు. అందుకే వీటిని కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వీటి కలయిక వల్ల వాంతులు, అలెర్జీలు, అజీర్ణం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు బొప్పాయి తినడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు పండ్లను కలిపి తినడం వల్ల ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలు తీవ్రం కావచ్చని చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం.. అరటిపండు శరీరానికి చలువ చేస్తుంది. బొప్పాయి శరీరాన్ని వేడి చేస్తుంది. ఈ రెండు విభిన్న స్వభావాలు కలిగిన పండ్లను కలిపి తీసుకుంటే జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. ఫలితంగా తలనొప్పి, వాంతులు, తలతిరుగుడు, అలెర్జీలు వంటి సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా కామెర్లు ఉన్నవారు బొప్పాయి తినకూడదు. ఇందులో ఉండే పపైన్, బీటా కెరోటిన్ కామెర్ల సమస్యను పెంచుతాయని వైద్యులు తెలిపారు. అలాగే శరీరంలో పొటాషియం అధికంగా ఉన్నవారు అరటిపండ్లు తినకుండా ఉండడం మంచిది. కాబట్టి ఈ పండ్లను కలిపి తినకుండా విడివిడిగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుంది.



## ఈ ఆకులు తినండి.. రాత్రుల్లో ప్రశాంతంగా నిద్రపోతారు..!

తులసి ఆకులు నిద్రను ప్రేరేపించడంలో చాలా ప్రభావవంతంగా పని చేస్తాయంటున్నారు నిపుణులు. రాత్రి పడుకునే ముందు 45 తులసి ఆకులను నమలడం లేదా తులసి టీ తాగడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. వేప ఆకులు శరీరం లోపలి నుండి విషాన్ని తొలగించడంతో పాటు నిద్రకు సహాయపడతాయి. వేప టీ తాగడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. నిద్రలేమి నుండి ఉపశమనం లభిస్తుంది. పుదీనా ఆకుల శీతలీకరణ ప్రభావం మనస్సు, నరాలకు విశ్రాంతినిస్తుంది. పుదీనా ఆకులు తినడం లేదా దాని టీ తాగడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. ఇది గాఢ నిద్రకు ఉపక్రమిస్తుంది.వాము ఆకులు జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచుతాయి. గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలను తొలగిస్తాయి. కడుపు తేలికగా, మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు, నిద్ర త్వరగా రావడం ప్రారంభమవుతుంది.ఆయుర్వేదంలో బ్రాహ్మి ఆకులు మనసును శాంతపరిచే ఔషధంగా చెప్పబడ్డాయి. ఇది మానసిక అలసట, ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది రాత్రంతా ప్రశాంతమైన నిద్రను పొందడంలో సహాయపడుతుంది. అశ్వగంధ ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటుంది. దీని ఆకులను తీసుకోవడం వల్ల సహజ నిద్రను ప్రేరేపించే ఔషధంగా పనిచేస్తుంది. కంటి నిండా నిద్రను మెరుగుపరుస్తుంది.

# నువ్వులతో ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

నువ్వులలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియంతోపాటు ఇతర యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. నువ్వులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం..
పీచు పుష్కలంగా ఉండే నువ్వులను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులకు నువ్వులు చాలా మంచిది. నువ్వులు తింటే గుండె ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిలోని 'ఒలియిక్ యాసిడ్' , 'లినోలిక్ యాసిడ్' వంటివి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.
నువ్వులు ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. నువ్వులలో ఉండే అధిక కాల్షియం దీనికి తోడ్పడుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధులతో పోరాడేందుకు నువ్వులను తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. నువ్వులు మన జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కూడా చాలా మేలు చేస్తాయి. నువ్వులలోని పీచు అరుగుదలకు తోడ్పడుతుంది. మలబద్ధకం వంటి జీర్ణ సమస్యల నుంచి బయటపడటానికి నువ్వులు దివ్యౌషధంగా పనిచేస్తాయి.
నువ్వులు మెదడు పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. నువ్వులలో ఉండే అనేక పోషకాలు దీనికి ఉపయోగపడుతాయి. ముఖ్యంగా నువ్వుల్లో ఉండే విటమిన్ బి6 మెదడుకు మేలు చేస్తుంది. నువ్వులు మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, చర్మ వ్యాధులతో పోరాడటానికి సహాయపడతాయి. నువ్వులలోని విటమిన్-ఇ, యాంటీ ఆక్సిడెంట్లు ఇందుకు సహకరిస్తాయి.





# 33 ఏళ్ల నటికి చరణ్ తల్లిగా ఆఫర్..

సినిమాల్లో అప్పుడప్పుడు చిత్రవిచిత్రాలు జరుగుతుంటాయి. నిజ జీవితంలో హీరోల కంటే తక్కువ వయసులో ఉన్న కొందరు.. అదే హీరోలకు తల్లిపిన్ని తరహా పాత్రలు చేస్తుంటారు. ఇప్పుడు ఇలాంటి ఓ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఓ మలయాళ నటికి ఏకంగా రామ్ చరణ్ తల్లిగా నటించే ఛాన్స్ వచ్చింది కానీ ఆమె దాన్ని మరో ఆలోచన లేకుండా రిజెక్ట్ చేసింది. ఇంతకీ ఎవరామె? ఏంటి సంగతి? మలయాళ నటి స్వాసిక తెలుగు ప్రేక్షకులకు కూడా కాస్త పరిచయమే. రీసెంట్‌గా రిలీజైన నితిన్ 'తమ్ముడు' సినిమాలో చుట్ట కాలుస్తూ విలన్‌గా చేసింది ఈమెనే. 2009లో ఇండస్ట్రీలోకి వచ్చిన ఈమె.. మలయాళ, తమిళ సినిమాలు చేసింది. రియాలిటీ షోలు, టీవీ సీరియల్స్ కూడా చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. గతేడాది రిలీజైన తమిళ మూవీ 'లబ్బర్ పందు'లో హీరోయిన్‌కి తల్లిగా అద్భుతంగా నటించింది. ఈ మూవీ వచ్చిన తర్వాత నుంచి ఈమె తల్లి పాత్రలే చాలా వస్తున్నాయి. ఈ విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.

'తల్లి పాత్రల ఆఫర్స్ వరసపెట్టి వస్తూనే ఉన్నాయి. ఇవన్నీ కాదు గానీ రామ్ చరణ్‌కి తల్లిగా నటించే ఛాన్స్ రావడం మాత్రం



నాకు పెద్ద షాక్ ఇచ్చింది. 'పెద్ది' మూవీ కోసమే అడిగారు. కానీ నేను చేయనని చెప్పేశాను. చేసుంటే ఎలా ఉండేదే ఏమో గానీ ఇప్పుడు ఒప్పుకోవడం కరెక్ట్ కాదనిపించింది. భవిష్యత్తులో ఇదే అవకాశం వస్తే మాత్రం ఆలోచిస్తాను' అని స్వాసిక చెప్పుకొచ్చింది.

ప్రస్తుతం స్వాసిక వయసు 33 ఏళ్లే. రామ్ చరణ్ వయసు 40 ఏళ్లు. ఒకవేళ చేసుంటే మాత్రం క్రేజీగా ఉండేదేమో. స్వాసిక వ్యక్తిగత విషయానికొస్తే.. నటుడు ప్రేమ్ జాకబ్‌ని గత కొన్నేళ్లుగా ప్రేమించింది. గతేడాది వీళ్లిద్దరూ పెళ్లి చేసుకున్నారు. రీసెంట్‌గా వచ్చిన రెట్రో, మామన్, తమ్ముడు చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం సూర్య 'కరుప్పు' మూవీలో కీలక పాత్ర చేస్తోంది.

'పెద్ది' విషయానికొస్తే.. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ స్టోరీతో దీన్ని తీస్తున్నారు. ఇప్పటికే ఓ గ్లింప్స్ రాగా అంచనాలు పెంచేసింది. జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తున్నాడు. బుచ్చిబాబు దర్శకుడు. వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలో రిలీజ్ చేస్తామని ఇప్పటికే అధికారికంగానూ ప్రకటించారు.

# భలే ఇరకాటం వచ్చిందోయ్

సెప్టెంబర్ 5 విడుదల కావాల్సిన మిరాయ్ వాయిదా పడటం ఖాయమేనని విశ్వసనీయ సమాచారం. ఇప్పటిదాకా ప్రమోషన్లు పూర్తి స్థాయిలో మొదలు పెట్టకపోవడం, ఫెడరేషన్ సమ్మె వల్ల బ్యాలన్స్ ఉన్న ముఖ్యమైన పనులు ఆగిపోవడం ఫైనల్ కట్‌ని ఆలస్యం చేస్తున్నాయని ఇన్ సైడ్ టాక్. ఇప్పటికిప్పుడు అవన్నీ పూర్తి చేసుకుని పది రోజుల్లో సిద్ధం చేయడం జరగని పనని భావించడంతో వాయిదా వైపే మొగ్గు చూపుతున్నట్టు తెలిసింది. ఇది చూచాయగా తెలిసిన మరుక్షణం సోషల్ మీడియా స్టార్ మౌళి హీరోగా రూపొందిన లిటిల్ హార్ట్స్ సెప్టెంబర్ 5 వచ్చేందుకు రెడీ అవుతోందట. అనౌన్స్ మెంట్ ఏ నిమిషమైనా రావొచ్చు. ఇప్పుడు మిరాయ్ చేతిలో ఉన్నది సెప్టెంబర్ 12 ఒకటే. అక్కడేమో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కిష్కింధపురి ఉంది. దానితో కాంపిటేషన్ గురించి టెన్షన్ అక్కర్లేదు కానీ ముందైతే నిర్ణయం తీసుకుంటే వాళ్ళు వెనక్కు తగ్గడమో లేదా బయ్యర్లు థియేటర్ల సర్దుబాటు గురించి మాట్లాడుకోవడమో చేయొచ్చు. మాస్ జాతర ఎలాగూ వచ్చే సూచనలు లేవు కాబట్టి ఆ డేట్ సేఫ్ అవుతుంది. సెప్టెంబర్ 25 ఓజి ఉంటుంది. దానితో ఢీ కొట్టడం ఎంత మాత్రం సేఫ్ కాదు. అసలు మిరాయ్ నిర్మాత టిజి విశ్వ ప్రసాదే దానికి ఒప్పుకోరు. లేదంటే అక్టోబర్ కు వెళ్లడం తప్ప మిరాయ్ కు మరో ఆప్షన్ ఉండదు. ఇదో పెద్ద సస్పెన్స్ గా మారిపోయింది. హనుమాన్ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని చేసిన సినిమా కావడంతో తేజ సజ్జకు మిరాయ్ సోలో రిలీజ్ చాలా కీలకం. హనుమాన్ టైంలో సంక్రాంతి సీజన్ కాబట్టి మహేష్ బాబు, నాగార్జున, వెంకటేష్‌ను తట్టుకుని కంటెంట్ బలంతో గెలిచాడు. ప్రతిసారి పరిస్థితులు అంత సానుకూలంగా ఉండవు.





# ఇంత ప్రేమ తట్టుకోవడం ఎలా

ఇవాళ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మెగాస్టార్ హంగామాతో సోషల్ మీడియా ఊగిపోయింది. నిన్న సాయంత్రం విశ్వంభరతో మొదలైన హడావిడి ఇవాళ మన శంకరవరప్రసాద్ గారు టైటిల్ లాంచ్, చిరు బాబీ కాన్సెప్ట్ పోస్టర్ తో నెక్స్ట్ లెవెల్ కు వెళ్ళిపోయింది. అయితే ఇన్ని వీడియోలు, లుక్కులను మించిన ఎలివేషన్ శ్రీకాంత్ ఓదెల జస్ట్ ఒక ట్వీట్ తో ఇచ్చిపారేయడం అభిమానుల్లో హాట్ టాపిక్ గా మారింది. నా చిరంజీవిని మిస్సవుతూ వచ్చానని, నేను వెనక్కు తీసుకొస్తానని, ఇది రక్తంతో చేస్తున్న ప్రమాణమంటూ ఓ రేంజ్ లో గూస్ బంప్స్ పదాలతో ట్వీట్ నింపిన తీరు మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేలా ఉంది. జీవిత కాలం ఆడే సినిమా చిరంజీవి, అలాంటిది చిరంజీవితోనే సినిమా అంటే జీవితాంతం గుర్తుండిపోయేలా తీయాలని, ఇంతకన్నా వేరే ఆప్షన్ లేదని చెప్పడం శ్రీకాంత్ ఓదెల ఫ్యానిజంని పూర్తిగా బయట పెట్టేసింది. స్వయంగా అతని తల్లి ఫోటోలో నిన్నెప్పుడు నవ్వుతూ చూడలేదని, ఇప్పుడు చూశానని చిరంజీవితో కలిసి ఉన్న పిక్ ని ఉద్దేశించి చెప్పడం మరో ఎలివేషన్. నిన్న ఈరోజు చిరంజీవిని ఎందరో విష్ చేశారు కానీ ఈ స్థాయిలో ఊపేసింది మాత్రం శ్రీకాంత్ ఓదెల ఒక్కడే. దెబ్బకు ట్వీట్ వైరల్ అయిపోయి ఎక్కడ చూసినా దీని గురించిన చర్చలే సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు తెరకెక్కడానికి ఇంకా టైం పడుతుంది. శ్రీకాంత్ ఓదెల ముందు నాని ది ప్యారడైజ్ పూర్తి చేయాలి. ఇది మార్చ్ లో రిలీజ్ అయ్యాక అప్పుడు మెగా 159 పనులు మొదలవుతాయి. ఈలోగా మన శంకరవరప్రసాద్ గారు, విశ్వంభర రిలీజైపోతాయి. బాబీతో చేస్తున్న సినిమా వేసవికంతా కొలిక్కి వచ్చేస్తుంది. సో నెక్స్ట్ ఓదెలనే ఉంటాడు. నాని నిర్మాతగా వ్యవహరించబోతున్న మెగా 159లో హీరోయిన్ ని ఇంకా ఖరారు చేయలేదు. టెక్నికల్ టీమ్ ఫైనల్ కాలేదు. సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పేరు వినిపిస్తోంది కానీ ఫైనల్ అయితే చేయలేదు. దీని అప్డేట్స్ ఇంకో ఆరేడు నెలల వరకు ఆశించలేం.

# తారక్ కన్నా ఎక్కువ నష్టం హృతిక్కే

కనీసం యావరేజ్ అయినా సంతోషించే వాళ్ళు కానీ వార్ 2 డిజాస్టర్ కావడం ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా టెంపర్ నుంచి కాపాడుకుంటూ వస్తున్న సక్సెస్ ట్రాక్ ని ఈ సినిమా బ్రేక్ చేయడం డైజెస్ట్ కావడం లేదు. వరస హిట్లతో పదేళ్లకు పైగా ఫ్లాప్ లేకుండా నడిచిన జూనియర్ ఎన్టీఆర్ స్పీడ్ కు ఇది పెద్ద అడ్డంకిగా నిలిచిపోయింది. అయితే వార్ 2 ఇద్దరు హీరోల్లో ఎవరికి ఎక్కువ నష్టం జరిగిందంటే నిస్సందేహంగా హృతిక్ రోషన్ కే అని చెప్పొచ్చు. ఎందుకంటే తను వేగంగా సినిమాలు చేయడం మానేశాడు. గత పది సంవత్సరాల్లో అతను చేసింది కేవలం ఏడు సినిమాలు మాత్రమే. వాటిలో మూడు సూపర్ ఫ్లాపులు ఉన్నాయి. నెక్స్ట్ లైనప్ లో పెట్టుకున్న క్రిష్ 4కి ఎంత లేదన్నా రెండేళ్లకు పైగానే టైం పట్టేలా ఉంది. ఒకవేళ వార్ 2 బ్లాక్ బస్టర్ అయ్యుంటే క్రిష్ 4 బిజినెస్ కి చాలా హెల్ప్ అయ్యేది. కానీ ఇప్పుడు దర్శక నిర్మాత రాకేష్ రోషన్ కు నిధులు సమీకరించడం పెద్ద సవాల్ గా మారుతుంది. ఎందుకంటే మార్కెట్ కోణంలో చూసుకుంటే హృతిక్ గత సినిమాల్లో ఫైటర్ జస్ట్ హిట్ అనిపించుకోగా, విక్రమ్ వేదా దారుణంగా పోయింది. పెట్టుబడిదారులు తన విషయంలో చాలా క్యాలికులేటెడ్ గా ఉన్నారు. సో క్రిష్ 4 ఆశించిన వందల కోట్ల బడ్జెట్ మీద అనుమానాలు ముసురుకుంటాయి. జూనియర్ ఎన్టీఆర్ వైపు చూస్తే వార్ 2 పరాజయం చిన్న డెంట్ లాంటిది. ఎందుకంటే నెక్స్ట్ రాబోయే ప్రశాంత్ నీల్ మూవీకి సరిపడా బజ్ షూటింగ్ స్టేజి నుంచే వచ్చేసింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ తో చేయబోయే ఫాంటసీ మూవీ గురించి నిర్మాత నాగవంశీ ఇస్తున్న హింట్లు అంచనాలను ఎక్కడికో తీసుకెళుతున్నాయి.



# సస్పెన్స్ థ్రిల్లర్ 'త్రిశెంకినీ'

ఎన్.బి.జె. ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత ఎన్. బిక్కునాథ్ నాయక్ నిర్మిస్తున్న సినిమా త్రిశెంకినీ. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు రంజిత్ కుమార్. పలువురు నూతన నటీనటులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్య నటుడు బాబు మోహన్ అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు బాబుమోహన్ మాట్లాడుతూ "మెగాస్టార్ బర్త్ డే సందర్భంగా త్రిశెంకినీ సినిమా టైటిల్ లాంచ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి అన్నగారి మీద దేవుడు ఎంత ఆశీర్వాదం చూపించాడో, అంతే ఈ సినిమా మీద, మీ మీద చూపించాలని కోరుతున్నా"అని అన్నారు. నిర్మాత ఎన్. బిక్కునాథ్ నాయక్ మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో ఓ సరికొత్త మూవీ చేశామని తెలిపారు. నటుడు, దర్శకుడు రంజిత్ కుమార్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో జై జై మెగాస్టార్ అనే పాట రూపొందించాం. ఆ పాట మెగాభిమానులు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. కాపీ రైట్ లేదు. మీ అందరి ఆశీర్వాదంతో మా సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా"అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా.రాజేంద్రతో పాటు చిత్ర బృందం పాల్గొంది.



# పూజా హెగ్డేకు మళ్లీ నిరాశేనా?

పూజా హెగ్డే బేసిగ్గా బాలీవుడ్ హీరోయిన్ అయినా.. ఆమెకు స్టార్ ఇమేజ్ వచ్చింది, పెద్ద పెద్ద సినిమాలు చేసింది తెలుగులోనే. కెరీర్ ఆరంభంలో చేసిన ముకుంద, ఒక లైలా కోసం లాంటి చిత్రాలు నిరాశపరిచినా.. 'దువ్వాడ జగన్నాథం'తో బ్రేక్ అందుకున్న ఆమె.. చూస్తుండగానే పెద్ద రేంజికి ఎదిగిపోయింది. అరవింద సమేత, మహర్షి, అల వైకుంఠపురములో లాంటి ఘనవిజయాలతో ఆమె దూసుకెళ్లింది. కానీ ఆమె ప్రైమ్ ఎక్కువ కాలం కొనసాగలేదు. వరుస ఫ్లాపులు ఆమెను వెనక్కి లాగేశాయి. ఎంత వేగంగా పైకి ఎదిగిందో.. అంతే వేగంగా కింద పడిపోయింది. రెండేళ్లకు పైగా తెలుగులో ఆమెకు సినిమానే లేని పరిస్థితి తలెత్తింది. 'గుంటూరు కారం' నుంచి తప్పించాక.. తెలుగులో ఇంకో అవకాశమే అందుకోలేకపోయింది పూజా. తన రీఎంట్రీ మూవీ గురించి వార్తలు వస్తున్నాయి కానీ.. అవేవీ నిజం కావడం లేదు. ఇటీవల పూజా సైతం తన టాలీవుడ్ రీఎంట్రీ గురించి మాట్లాడిరది. తాను ఓ సినిమాకు సంతకం చేసినట్లు చెప్పింది. దుల్కర్ సల్మాన్ హీరోగా రవి నేలకుడితి అనే కొత్త దర్శకుడు సుధాకర్ చెరుకూరి నిర్మాణంలో చేయబోయే సినిమాలో పూజా నటించబోతున్నట్లు వార్తలు వచ్చాయి. దాని గురించి ఇక అధికారిక ప్రకటన రావడమే తరువాయి అనుకున్నారు. కానీ ఇప్పుడు ఉన్నట్లుండి కథ అడ్డం తిరిగింది. ఈ చిత్రంలో పూజా నటించట్లేదు. ఆమె స్థానంలోకి శ్రుతి హాసన్ రానుంది అనే వార్తలు రావడం గమనార్హం. తాను ఈ సినిమాలో నటిస్తున్న విషయాన్ని శ్రుతి ఒక ఇంటర్వ్యూలో బయటపెట్టింది. అంటే.. పూజా దీన్నుంచి తప్పుకున్నట్లే. అలా కాకుండా ఇద్దరు నటించనున్నారా అనే కోణంలో కూడా రూమర్స్ వస్తున్నాయి కానీ అధికారిక ప్రకటన వచ్చేవరకు నమ్మలేం.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## ప్రశాంత్ నగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ముప్పు శ్రీనివాస్ రెడ్డికి వినతి

**నాగారం, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ నియోజకవర్గంలోని నాగారం మున్సిపల్ పరిధి 15వ వార్డు ప్రశాంత్ నగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి అవసరంపై కాలనీవాసులు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు.

కార్యక్రమానికి కాలనీ అధ్యక్షుడు ఎర్రబోయిన కృష్ణ యాదవ్ నాయకత్వం వహించగా, నూతనంగా ఎన్నికైన కాలనీ కార్యవర్గ సభ్యులు కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. రోడ్ల , డ్రైనేజీ వ్యవస్థలో లోపాలు, వీధి దీపాల సమస్యలు, చెత్త తొలగింపులో ఉన్న ఇబ్బందులు వంటి సమస్యలను సమగ్రంగా వివరించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఈ వినతి పత్రాన్ని స్వీకరించి సమస్యలను మున్సిపల్ అధికారుల సమావేశంలో ప్రస్తావించి, అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రాధాన్యత ఇస్తామని ఆయన భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో మచ్చా రామకృష్ణ గౌడ్, పేరం లక్ష్మీరెడ్డి, పరమండ్ల దుర్గా రెడ్డి, బోళ్ల శంకర్, పూనమల్లి త్యాగరాజన్, మాధ మోహన్ బాబు, బొల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా జనరల్ సెక్రటరీగా హన్మకొండ శ్రీకాంత్


- హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన జర్నలిస్ట్‌కు కీలక బాధ్యత
- ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ ఆదేశాల మేరకు నియామకం
- స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బొల్లెపాక రాజేష్ అధికారిక ప్రకటన
- నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన నూతన సెక్రటరీ శ్రీకాంత్



**హనుమకొండ,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా జనరల్ సెక్రటరీగా హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన హన్మకొండ శ్రీకాంత్‌ను నియమించినట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకం ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ ఆదేశాల మేరకు జరిగినట్లు ఆయన వివరించారు. శ్రీకాంత్ గత కొన్నేళ్లుగా జర్నలిజంలో చురుకుగా కొనసాగుతూ ప్రభుత్వం, ప్రతిపక్షాలపై విశ్లేషణాత్మక కథనాలు రాశారు. విద్య, ఆరోగ్య రంగాలపై లోతైన అధ్యయనం చేసి సమగ్ర నివేదికలు సమర్పించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ నిబద్ధత, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీగా శ్రీకాంత్‌ను నియమించినట్లు ఫోరం ప్రకటించింది.

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ "జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారమే నా తొలి ప్రాధాన్యం. వారి హక్కులు, భద్రత, సంక్షేమం కోసం అన్ని స్థాయిల్లో పోరాడతాను. అదే విధంగా మాదిగ కమ్యూనిటీని వేధిస్తున్న సామాజిక, ఆర్థిక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వం స్పందించేలా కృషి చేస్తాను. కమ్యూనిటీ అభివృద్ధి, జర్నలిస్టుల బలోపేతం కోసం నేను ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తాను" అని తెలిపారు.అదేవిధంగా తనకు ఈ బాధ్యత రావడానికి సహకరించిన రాష్ట్ర నాయకులు బొల్లెపాక రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్, జిల్లా అధ్యక్షుడు సందేల రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.





# "ఊరూరుకి బీఆర్ఎస్ సంక్షేమాలు.. ఇంటింటికీ కేసీఆర్ పథకాలు"

## ప్రజలతో మమేకమవుతున్న తాటికొండ రాజయ్య

- నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అడుగుపెడుతున్న యాత్ర
- ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ పట్ల నమ్మకాన్ని నాటుతున్న వినూత్న కార్యక్రమం
- కార్యకర్తలా,నాయకుడిలా బలమైన ప్రజానుభంధం చూపుతున్న తొలి ఉపముఖ్యమంత్రి



**స్టేషన్ ఘనపూర్, ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్న నేతల్లో డాక్టర్ తాటికొండ రాజయ్య పేరు ముందుంటుంది. స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యేగా, రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రిగా ఆయనకున్న గుర్తింపు వేరే. అయితే ఇప్పుడు మళ్లీ సాధారణ కార్యకర్తలా ప్రజల మధ్యకు వెళ్లి, "ఊరూరుకి బీఆర్ఎస్ సంక్షేమాలు - ఇంటింటికీ కేసీఆర్ పథకాలు" అనే వినూత్న కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

ప్రతి గ్రామాన్ని వ్యక్తిగతంగా సందర్శిస్తూ, ప్రజలతో నేరుగా మాట్లాడుతున్న రాజయ్య, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను గుర్తుచేస్తున్నారు. పింఛన్ల పెంపు, రైతు బంధు, రైతు బీమా, విద్యుత్ ఉచితం, కిలోల బియ్యం, కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టులు - ఇవన్నీ కేసీఆర్ పాలనలోనే సాధ్యమయ్యాయని ఆయన వివరించి ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతున్నారు.

> తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, ఇపుడు కార్యకర్తలా కష్టపడుతూ ఈ వినూత్న పాదయాత్రను సాగించడం రాజయ్య ప్రత్యేకత. ప్రజల మధ్య నమ్మకాన్ని, బీఆర్ఎస్ పట్ల విశ్వాసాన్ని పెంపొందించడం ఆయన నిజమైన ధ్యేయం. స్థానికులు చెబుతున్నట్టే – ఈ "ఊరూరుకి బీఆర్ఎస్ సంక్షేమాలు" యాత్ర నిజానికి ఒక ప్రజా పునర్నిర్మాణ ఉద్యమంగా మారింది.



ఇది కేవలం సంక్షేమాలను గుర్తుచేసే పర్యటన మాత్రమే కాదు. ప్రజల సమస్యలు విని వాటి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారు. అందుకే గ్రామాల్లో రాజయ్య అడుగు పెడితే ఉత్సాహం వెల్లివిరుస్తోంది. చిన్నా పెద్దా అందరితో మమేకమై, ఆప్యాయంగా మాట్లాడి ప్రజల గుండెల్లో మరింత బలమైన అనుబంధాన్ని పెంచుకుంటున్నారు.

# ధూప దీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**నాచారం, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**



గ్రామీణ ప్రాంత ధూప దీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా జోరుగా వినిపిస్తోంది. తెలంగాణ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం హబ్సిగూడలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జేఏసీ చైర్మన్ గంగ ఉపేంద్ర శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

"ప్రతి అర్చకుడు స్వతంత్రంగా ఎదగాలని, బీసీ వర్గాలకు అర్చక సంఘాల్లో పెద్ద పీట వేశామని" ఉపేంద్ర శర్మ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అర్చకుల పోరాటాల ఫలితంగానే ధూప దీప నైవేద్యం పథకం అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. ప్రారంభంలో 3,600 ఆలయాలకు ఈ పథకం వర్తించగా, అర్చకుల వేతనాలు రూ.2,500 నుంచి రూ.6,000, ఆ తర్వాత రూ.10,000 వరకు పెరగడం ఉద్యమ విజయమని వివరించారు.

అర్చకులకు ఇన్సూరెన్స్ పథకం తీసుకు రావడంపై ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. బ్రాహ్మణుల ఆత్మ గౌరవం కోసం, చిన్న అర్చకుల సంక్షేమం కోసం సమాఖ్య పలు పోరాటాలు నిర్వహించిందని చెప్పారు. ఆలయ ఆదాయాన్ని పెంచే దిశగా అర్చకులూ కృషి చేయాలని, సహేతుకమైన డిమాండ్లతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ధూప దీప నైవేద్యం పథకంలో డబ్బులు వసూలు చేయడం సరికాదని హెచ్చరించారు.

అర్చకుల హక్కులు, సంక్షేమం, ఆలయాల అభివృద్ధిపై ఈ సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్ చార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ శర్మ, డిడిఎన్ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పెరంబుదూరి శ్రీకాంత్ స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శటగోపం శ్రీనివాస్ చార్యులు, ఏడబ్ల్యూఎఫ్ సభ్యుడు జక్కాపురం నారాయణ, పూర్వ అధ్యక్షుడు శ్రీనివాస్ సుదర్శన్, సలహాదారు శ్రీకోటి జలందర్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు కన్నీరు – రాజయ్య నడక



> గండిరామారం–తరిగొప్పల లిఫ్ట్ పనులపై ఆగ్రహం
> రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ పంథా
> 31న వేలేరు నుండి గండిరామారం వరకు పాదయాత్ర

**స్టేషన్ ఘనపూర్, ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**

స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య మరోసారి రైతు సమస్యల కోసం కదిలారు. గండిరామారం–తరిగొప్పల లిఫ్ట్ పనులు మంజూరై ఏడాది దాటినా ఒక్క అడుగు ముందుకు వేయకపోవడం, నిధులు విడుదల చేయకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పంటలు ఎండిపోతున్నా, జీవనోపాధి కష్టాల్లో ఉన్నా ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందని రాజయ్య మండిపడ్డారు.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 31న వేలేరు నుంచి గండిరామారం రిజర్వాయర్ వరకు భారీ రైతు పాదయాత్ర నిర్వహించనున్నట్లు రాజయ్య ప్రకటించారు. "రైతు కన్నీటి చుక్క వృథా కావొద్దు, ప్రతి చుక్కను నీరుగా మార్చాలి" అన్న ధృడనిశ్చయంతో ఆయన నడక మొదలవనుంది. రైతు సమస్యలపై ఆయన మళ్లీ స్వరమై నిలుస్తున్న ఈ పాదయాత్ర ప్రాంత ప్రజల్లో చర్చనీయాంశమైంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in